# 6

# యేసు బాప్తిస్మము

## (3:13-17)

యేసు పొందిన బాప్తిస్మమును అర్థంచేసుకొనుట అనేకులకు కష్టముగా నున్నది. యేసు క్రీస్తుకు క్షమాపణ అవసరం లేదు. యేసు బాప్తిస్మము పొందుకొనుట ద్వారా "నీతి యావత్తును నెరవేర్చుటను బట్టి" లేఖనములలోని ఈ విభాగము శక్తివంతమైనదై యున్నది.

### దైవికమైన నిర్ణయము (3:13, 14)

**13ఆ సమయమున యోహాను చేత బాప్తిస్మము పొందుటకు యేసు గలిలయనుండి యొర్దాను దగ్గరనున్న అతనియొద్దకు వచ్చెను. 14అందుకు యోహాను-నేను నీ చేత బాప్తిస్మము పొందవలసినవాడనై యుండగా, నీవు నా యొద్దకు వచ్చుచున్నావా? అని ఆయనను నివారింపజూచెను.**

**వచనము 13**. యేసు తన బహిరంగ జీవితములోనికి ప్రవేశించుటకు సిద్ధపడుచు, **యోహాను** ఆయనకు బాప్తిస్మమియ్యవలెనని మనవి చేయుచు యేసు యోహాను యొద్దకు వెళ్లుట ద్వారా తన బహిరంగ పరిచర్యను ప్రారంభించాడు. "వచ్చెను" అని అనువదింపబడిన క్రియాపదము యోహాను పరిచర్య ప్రారంభంలో అనువదింపబడిన అదే క్రియాపదమై యున్నది (3:1). యేసు యోహాను యొద్దకు వచ్చుటకు సంబంధించినంత వరకు, డొనాల్ ఏ. హేగ్నర్ ఇలా చెప్పుచున్నాడు, "ఇప్పుడు సువార్త యొక్క అసలైన వ్యక్తి రంగంలోనికి ప్రవేశించుచున్నాడు."[1]

మత్తయి నివేదించిన నివేదికలో, బాలుడైన యేసు నజరేతుకు తీసుకొనిపోబడినది మొదలుకొని (2:23) ఆయన బాప్తిస్మము పొందుకొనిన మధ్య కాలములో సంభవించిన విషయములు పేర్కొనబడుటను మనము చూడము. యేసు ఈ సమయంలో "దాదాపు ముప్పది ఏండ్ల యీడుగలవాడై యుండెనని" లూకా 3:23 మనకు తెలియజెప్పుచున్నది. ఆయన **గలిలయలోని** "నజరేతు" నుండి (మార్కు 1:9) యోహాను బాప్తిస్మమిచ్చుచుండిన **యొర్దాను** నదికి ఆవల నున్న "బేతనియ" వరకు (యోహాను 1:28). **అతని చేత అచ్చట బాప్తిస్మము పొందుటకు** ప్రయాణమై వెళ్లాడు.

**వచనము 14.** యేసు **యోహాను** యొద్దకు వచ్చినప్పుడు, యేసే మెస్సీయయై యుండెనని ఈ ప్రవక్త అనుకొన్నాడు. ఈ ఇరువురు కూడ, వయస్సులో ఆరు మాసముల తేడాతో, బంధువులై యుండిరి (లూకా 1:36). ఈ ఇరువురును కలిసి ఎదుగుచు, ఒకరినొకరు చూచుకొనుచు ఎంతగా అనందించియుందురో, అది ఒకరు ఊహించుకొనవలసిన విషయమై యున్నది. వారి చిన్నతనంలో యెరూషలేములో జరుగుచుండిన కొన్ని పస్కా పండుగ వేడుకల సందర్భంలో వారు కలుసుకొని యుందురు (లూకా 2:41, 42 చూడుము). ఏదిఏమైనా, ఒకవేళ ఈ ఇరువురు ఎన్నడైనను కలిసికొని యుండకపోవచ్చును లేదా కొంత కాలము

వరకు ఒకరి ముఖాలు మరొకరు చూచుకొని యుండకపోవచ్చును. బహూశా యోహాను అనేక సంవత్సరములవరకు అరణ్యములోనే ఏకాంతవాసిగా ఉండియుండుట కూడ సాధ్యమే (లూకా 1:80).

మొదట్లో, యేసుకు బాప్తిస్మమిచ్చుటకు యోహాను సంకోచించుచుండెను. **నేను నీ చేత బాప్తిస్మము పొందవలసినవాడనై యుండగా, నీవు నా యొద్దకు వచ్చుచున్నావా?** అని యోహాను పలికాడు. గ్రీకు వాక్యభాగములో, యోహాను అడిగిన ప్రశ్న నొక్కివక్కాణింపబడినదిగా ఉన్నది. "నేను నీ చేత బాప్తిస్మము పొందవలసినవాడనై యుండగా, నీవు నా యొద్దకు వచ్చుచున్నావా?" అనునది అక్షరార్థ అనువాదమై యుండును. యేసుకు బాప్తిస్మమిచ్చుటకు యోహాను వ్యక్తముచేసిన అసమ్మతి గూర్చి మత్తయి మాత్రమే ఆయన రచించిన సువార్తలో నివేదించాడు, మిగిలిన మూడు సువార్తల రచయితలు ఈ విషయమును పేర్కొనలేదు. డగ్లస్ ఆర్. ఏ. హేర్ ఇలా వ్యాఖ్యానించాడు, "బహూశా యోహాను చేత బాప్తిస్మము పొందుటకు యేసు యోహాను యొద్దకు వచ్చి అతని యెదుట తలవంచినందువలన యేసు యోహాను కంటె తక్కువైనవాడని స్వాధికారముతో చెప్పుచు బాప్తిస్మమిచ్చు యోహానును వెంబడించుండినవారి చేత మత్తయి యొక్క స్వాతిశయము పురికొల్పబడి యుండును."[2] తత్ఫలితంగా, ఆయన యోహాను నోట నుండి వచ్చిన మాటలను చేర్చుట ద్వారా ఈ తప్పుడభిప్రాయమును సరిదిద్దుచున్నాడు. ఈ సలహా న్యాయసమ్మతముగా నున్నది, ఏలయనగా మత్తయి తన సువార్తను రచించిన (అపొస్తలుల కార్యములు 19:1-7) మొదటి శతాబ్దము మధ్య కాలము నాటికి యోహానును వెంబడించుచుండిన శిష్యులు యింకను ఉండిరి. అంతమాత్రమేగాక, యేసు బాప్తిస్మమిచ్చు యోహాను కంటె తక్కువైనవాడను తప్పుడభిప్రాయము మాండేయ తెగకు చెందినవారి (ప్రాచీన బబులోను దేశ వంశస్థులు) మనస్సులలో నేటికిని నిలిచియున్నది.[3]

## దైవికమైన ఉద్దేశము (3:15)

**[15]యేసు-ఇప్పటికి కానిమ్ము; నీతి యావత్తు ఈలాగు నెరవేర్చుట మనకు తగియున్నదని అతనికి ఉత్తరమిచ్చెను గనుక అతడాలాగు కానిచ్చెను.**

**వచనము 15. యేసు-ఇప్పటికి కానిమ్ము; నీతి యావత్తు ఈలాగు నెరవేర్చుట మనకు తగియున్నదని** యోహానుతో చెప్పెను. ఇంతకు మునుపు పేర్కొన్నట్లుగా, యోహాను "పాపక్షమాపణ నిమిత్తము మారుమనస్సు విషయమైన" బాప్తిస్మమిచ్చుచుండెను (మార్కు 1:4) - కాని యేసు "ఏ పాపము ఎరుగడు" (2 కొరింథీయులకు 5:21; యోహాను 8:29; హెబ్రీయులకు 4:15; 7:26; 1 పేతురు 2:21, 22; 1 యోహాను 3:5 చూడుము). ఏదిఏమైనా, "తనకు విధేయులైన వారికందరికి నిత్య రక్షణకు కారకుడగునట్లు" (హెబ్రీయులకు 5:9) దేవునికి యేసు సంపూర్ణముగా విధేయుడై యుండవలసి యుండినది. "నీతి యావత్తు ఈలాగు నెరవేర్చుట" అను మాటల ఖచ్చితమైన అర్థము తర్కింపబడుచుండగా, యేసు బాప్తిస్మమునకు సంబంధించిన ఈ క్రింది వివరములు నిశ్చయములై యున్నవి:

1. ఆయన దేవుని చిత్తమునకు విధేయుడయ్యాడు (21:25, 32; లూకా 7:29, 30).

2. ఆయన యోహాను పరిచర్యను మరియు బాప్తిస్మమును అమోదించాడు.
3. ఆయన మనకు ఒక మాదిరిని చూపించాడు.
4. ఆయన తననుతాను పాపులతో వినయపూర్వకముగా గుర్తించుకొన్నాడు.
5. ఆయన, పాపులను నీతిమంతులనుగా తీర్చునట్లు ఆయన మరణముతో పూర్తికానుండిన తన పరిచర్యను ప్రారంభించాడు (యెషయా 53:11; మత్తయి 1:21).
6. ఆయన యోహానుకు మెస్సీయాగా బయలుపరచబడినాడు, కాబట్టి యోహాను ఆయనను ఇశ్రాయేలుకు బయలుపరచాడు (యోహాను 1:31, 32).

**అతడాలాగు కానిచ్చెను** అనునది యేసు తర్కముచే ప్రభావితుడైన యోహాను యేసుకు బాప్తిస్మము యిచ్చాడు.

## దైవికమైన సాక్ష్యము (3:16, 17)

**16యేసు బాప్తిస్మము పొందిన వెంటనే, నీళ్లలో నుండి ఒడ్డునకు వచ్చెను; ఇదిగో, ఆకాశము తెరవబడెను, దేవుని ఆత్మ పావురమువలె దిగి తనమీదికి వచ్చుట చూచెను, 17మరియు ఇదిగో, ఈయన నా ప్రియ కుమారుడు, ఈయనయందు నేనానందించుచున్నానని యొక శబ్దము ఆకాశమునుండి వచ్చెను.**

**వచనము 16. యేసు బాప్తిస్మము పొందిన వెంటనే, నీళ్లలో నుండి ఒడ్డునకు వచ్చెను.** ఈ వాంగ్మూలము నుండి, యేసు నీటిలో పూర్తిగా ముంచబడినాడను భావము అవశ్యముగా కలుగుతోంది, మరియు "బాప్తిస్మము" అను మాటకు అర్థము ఇదే (అపొస్తలుల కార్యములు 8:38, 39 చూడుము). ఆ సమయంలో, **ఆకాశము తెరవబడెను**. ఈ భాషా ప్రయోగము దేవుని ప్రత్యక్షతల గూర్చిన అనుభవములకు ఒక సామాన్య లక్షణమై యున్నది (యెషయా 64:1; యెహెజ్కేలు 1:1; యోహాను 1:51; అపొస్తలుల కార్యములు 7:56; 10:11; ప్రకటన 4:1). ఈ బాప్తిస్మము తరువాతి సంఘటన అమలుచేయుటకు వీలుకాని ఒక అనుభవమై యుండినదా లేక భౌతికమైన ఒక వాస్తవమై యుండినదా అను విషయము ఆలోచనా పూర్వకంగా చర్చింపబడవలసిన అంశమై యున్నది. దేవుని ఆత్మ పావురమువలె దిగి యేసు మీదికి వచ్చుట మరియు దేవుని స్వరము వినబడుట ఆ సమయంలో అచ్చట నుండిన వారందరు చూశారా/విన్నారా, లేక యోహాను మరియు యేసు మాత్రమే చూశారా? విన్నారా? అనునది ఇందుకు సంబంధించిన ఒక ప్రశ్నయై యున్నది (యోహాను 5:37 చూడుము).

**దేవుని ఆత్మ పావురమువలె దిగి తనమీదికి వచ్చుట చూచెను.** దేవుని ఆత్మ పావురమునకు పోల్చబడుట ఆయన దిగివచ్చిన విధానమునకు సంబంధించినదని అర్థము చేసికొనదగును. ఏదిఏమైనా, లూకా సువార్త రచయిత పోల్చుచున్న తీరు ఖచ్చితంగ భౌతికంగా కంటికి కనబడుటకు సంబంధించినదై యున్నది: "పరిశుద్ధాత్మ శరీరాకమువలె అయన మీదికి దిగివచ్చెను" (లూకా 3:22). పావురము మృదుత్వమునకును అమాయకత్వమునకును ఒక చిహ్నమై యుండినది (10:16). అంతేగాక, ఈ కాలములో యూదా మతము పరిశుద్ధాత్మ

పావురముతో సంబంధము కలిగియుండిన విషయమై యుండినది. జి. ఎఫ్. హేజల్ ఇలా వివరించుచున్నాడు,

> రబ్బియైన బెన్ జోమ, అపొస్తలుల సమకాలీనుడైన ఒక యౌవనుడు, "అది తన చంటిపిల్లల మీద కూర్చున్నప్పటికిని వాటిని ఆనుకొనక యుండు ఒక పావురమునలె, దేవుని ఆత్మ జలములపైన అల్లాడుచుండెనను [ఆదికాండము 1:2]" యూదా మత బోధకుల సాంప్రదాయము గూర్చి ఉల్లేఖించి చెప్పుచున్నాడు (టాల్మూడ్ *హగిగాహ్* 15ఎ).[4]

పావురము, అతడు మార్గము సిద్ధపరచుచుండిన వానిని గుర్తించునట్లు యోహానుకు ఇవ్వబడిన సంకేతమై యుండినది. యేసే మెస్సీయయై యున్నాడని యోహాను అనుకొన్నప్పటికిని – యేసుకు బాప్తిస్మమిచ్చుటకు యోహాను వెనుకంజ వేసాడో ఇది వివరించున్నది – పరిశుద్ధాత్మ యేసు మీదికి దిగివచ్చునంత వరకు కూడా యోహాను ఆ విషయాన్ని ఖచ్చితంగా తెలిసికొనలేదు (యోహాను 1:29–34). యేసు క్రీస్తై యుండెనని చెప్పుటకు పావురము ఒక ప్రయోగసిద్ధమైన నిదర్శనముగా ప్రయోజనకరమయ్యింది.

"యెహోవా ఆత్మ ... అతని మీద నిలుచును" (11:2); "అతనియందు నా ఆత్మను ఉంచియున్నాను" (42:1); "**ప్రభువగు** యెహోవా ఆత్మ నా మీదికి వచ్చియున్నది" (61:1) అని యెషయా పలికిన ప్రవచనములను సహితము ఈ సంఘటన నెరవేర్చినది. ఆయన దేవుని రాజ్యముపై రాజై యుండునట్లు క్రీస్తును అభిషేకించుచుండిన పరిశుద్ధాత్మ, ఈయనే. ఇంతే కాకుండా, యేసు యొర్దాను నది యొద్ద నుండి వెళ్లిపోయినప్పుడు, ఆయన పరిశుద్ధాత్మ శక్తితో నిండినవాడై వెళ్లాడు, ప్రతి విధమైన రోగమును స్వస్థపరచుచు దయ్యములను వెళ్లగొట్టాడు – ఆయన రాజ్యము యెడల వైరభావము కలిగియుండిన దుష్టశక్తులను కూలద్రోయుచు ముందుకు వెళ్లాడు (12:28; అపొస్తలుల కార్యములు 10:38).

**వచనము 17. ఇదిగో ఈయనే నా ప్రియ కుమారుడు, ఈయనయందు నేనానందించుచున్నాను** అని తండ్రి ఘోషించాడు. దేవుడు తన కుమారుని దైవత్వమును బహిరంగముగా ప్రకటించిన మూడింటిలో ఇది తొలి పలుకై యున్నది (17:5; యోహాను 12:28 చూడుము). ఈ మాటలు పాత నిబంధనలో నుండి తీసుకొనబడిన ప్రత్యక్ష ఉల్లేఖనము కాదు, కానీ అవి కొన్ని నిర్దిష్ట ఇతివృత్తములను స్మరణకు తెచ్చు జ్ఞాపకాలై యున్నవి. యేసు, దైవికమైన సుపుత్రుడై యున్నాడు, **ప్రభువు** అభిషేకించినవడై యున్నాడు (కీర్తనలు 2:7; అపొస్తలుల కార్యములు 13:33; హెబ్రీయులకు 1:5; 5:5 చూడుము). ఆయన దేవునికి ప్రియాతిప్రియమైనవాడై యున్నాడు మరియు ఆయనకు అతిగా ఇష్టుడైనవాడై యున్నాడు – "నేను ఏర్పరచుకొనినవాడు, నా ప్రాణమునకు ప్రియుడు" (యెషయా 42:1). ఈ భాష, అబ్రాహాముకు ప్రియాతిప్రియమైన వాగ్దాన పుత్రుడు, బల్యర్పణ గావింపవలెనని దేవుడు కోరినవాడునైన ఇస్సాకు వర్ణింపబడిన రీతిలో ఉన్నది (ఆదికాండము 22:2).

యేసు బాప్తిస్మము పొందిన సమయంలో దైవత్వములోని ముగ్గురు వ్యక్తులు[5] ఉపస్థితులై యుండిరి. యేసు క్రీస్తు, యోహానుతో కూడ నీటిలో ఉండెను. పరిశుద్ధాత్మ, పావురమువలె యేసు మీదికి దిగివచ్చాడు. ఇవన్నీ జరుగుచుండగా, దేవుడు తన కుమారుని గూర్చి అనుభూతి చెందుచుండిన ఆనందమును ఆకాశములోనుండి మాటలాడుచు బహిరంగముగా ప్రకటించాడు. యేసు బాప్తిస్మము పొందిన సమయంలో దైవత్వములోని ముగ్గురు వ్యక్తులు

ఉపస్థితులై యుండుట త్రిత్వమును ఒప్పుకొనని ఎవరికైనను పరిష్కరింపబడజాలని ఒక సమస్యయై యున్నది. పరిశుద్ధ సత్యవేదము "త్రిత్వము" అను పదమును ఎచ్చోటయైనను ప్రయోగించుటలేదు, కానీ, ఈ భావము న్యాయసమ్మతమైనదని అనేక లేఖనభాగములు రూఢీపర్చుచున్నవి (28:19; యోహాను 1:1–3, 14; 17:1–26; 2 కొరింథీయులకు 13:14; యూదా 20, 21; మార్కు 12:29 చూడుము). యేసు దేవుడై యుండెను కానీ ఆయన శరీరధారియై మన మధ్య నివసించాడు (యోహాను 1:1, 14).

✧✧✧✧✧ **పాఠములు** ✧✧✧✧✧

### యేసు బాప్తిస్మము (3:13–17)

ఈ క్రింది అంశముల ఆధారంగా యేసు బాప్తిస్మముపై ఒక పాఠమును సిద్ధంచేయవచ్చును:

1. దైవికమైన తీర్మానము (3:13, 14);
2. దైవికమైన ఉద్దేశము (3:15);
3. దైవికమైన సాక్ష్యము (3:16);
4. దైవికమైన సమక్షము (3:17).

### యేసు బాప్తిస్మము మరియు మన సొంత బాప్తిస్మము (3:13–17)

యేసు, తన బాప్తిస్మము ద్వారా, నేడు మనకొక మాదిరియై యుంటున్నాడని కొన్ని పర్యాయములు తర్కించబడుచున్నది. ఈ అభిప్రాయములో లేశమాత్రమైనా సత్యము లేకపోలేదు, సామ్యము సంక్లిష్టమైనదై యున్నది గనుక విమర్శనాత్మంగా దాని విలువను మదింపుచేయవలెను.

యేసు బాప్తిస్మమునకును ఈ రోజుల్లో ఇవ్వబడుచున్న బాప్తిస్మమునకును మధ్య మనము కొన్ని పోలికలు గమనించవచ్చును. బాప్తిస్మము, క్రొత్త నిబంధన చేత నిర్వచింపబడినట్లుగా, నేడు కూడ నీటిలో ముంచబడు విధానమునకు సంబంధించినదై యున్నది మరియు అది మరొకరి చేత ఇవ్వబడుచున్నది (స్వయంత్రణమునకు వ్యతిరేకమైనది). ఇంకా, యేసు దేవుని యెడల తన విధేయతను ప్రదర్శించినట్లే, ఒకడు నేడు క్రొత్త నిబంధన బాప్తిస్మము పొందినప్పుడు, వాడు పరిశుద్ధాత్మ వరమును పొందకొనును (అపొస్తలుల కార్యములు 2:38) – అది దాని పరిమాణముల అద్భుతములు చేయు వరములేనిదై యుండవచ్చును – గనుక వాడు దేవుని బిడ్డయై యున్నాడని ఘోషింపబడును (గలతీయులకు 3:26, 27).[6] యేసే పరిశుద్ధాత్మ చేత అభిషేకింపబడినాడు మరియు తండ్రి చేత ఆయన కుమారుడని ధ్రువీకరింపబడినాడు. యేసు బాప్తిస్మము మరియు క్రొత్త నిబంధన బాప్తిస్మము, ఈ రెండు కూడ దేవుని సేవకు (పరిచర్యకు) ప్రారంభ అంశాలుగా దృష్టింపబడవచ్చును.

అనేక పోలికలునట్టే, అనేక తారతమ్యములు కూడ కలవు. యేసు, యోహాను చేత బాప్తిస్మమిీయబడినాడు, యోహాను మార్గము సరాళము చేయుచు యిచ్చిన బాప్తిస్మము

ఆ మీదట న్యాయసమ్మతమైనదై యుండలేదు (అపొస్తలుల కార్యములు 19:1–7). క్రీస్తు సిలువపై మరణించినందునుబట్టి, ఆయన ఒక క్రొత్త నిబంధనను వ్యవస్థాపించాడు. కాబట్టి, క్రొత్త నిబంధన బాప్తిస్మములో సిలువమరణము నొంది మరలా లేచిన యేసు క్రీస్తునందలి విశ్వాసము కలిసియున్నది (మార్కు 16:16). ఇందుకు మారుమనస్సు పొందుట అవశ్యకమై యున్నది, ఆయన పాపము లేనివాడైనందు వలన మారుమనస్సు పొందుట క్రీస్తు విషయంలో అదొక విధింపబడని విషయమై యున్నది. పశ్చాత్తాపపడు విశ్వాసి వాని పాపములు క్షమింపబడు నిమిత్తము – యేసు క్రీస్తు రక్తములో కడుగబడు నిమిత్తము – క్రొత్త నిబంధన బాప్తిస్మమునకు విధేయుడగును (అపొస్తలుల కార్యములు 2:38; 22:16; ప్రకటన 1:5 చూడుము). ఈ చర్య ద్వారా, అతడు యేసు క్రీస్తు యొక్క మరణ పునరుత్థానములను చిత్రీకరించును (రోమీయులకు 6:3, 4). అతడు క్రీస్తు నందు నూతన సృష్టి యగును (రోమీయులకు 6) గనుక క్రీస్తు ద్వారా రాజ్యము (సంఘము) లోనికి చేర్చుకొనబడును (అపొస్తలుల కార్యములు 2:47; 1 కొరింథీయులకు 12:13 చూడుము).

ప్రతి ఒక్కరు బాప్తిస్మము పొందుట ద్వారా క్రీస్తు ప్రదర్శించిన విధేయతను అనుసరించి నడుచుకొనవలెను, మరియు క్రొత్త నిబంధన బాప్తిస్మము యొక్క విలక్షణమైన అర్థం గూర్చి కూడ ఒకనికి స్పష్టముగా తెలియజెప్పబడవలెను. యేసు పొందిన బాప్తిస్మము మరియు క్రొత్త నిబంధన బాప్తిస్మము ఒకటే కాదు.

---

సూచనలు

[1]Donald A Hagner, *Matthew 1-13*, Word Biblical Commentary, vol. 33A (Dallas: Word Books, 1993), 55. [2]Douglas R. A. Hare, *Matthew*, Interpretation (Louisville: John Knox Press, 1993), 20. [3]మాండేమనాదము అధునిక ఇరాక్ దేశాల్లో యింకను అభ్యసింపబడుచున్నది. అది క్రీ.శ. రెండవ శతాబ్దము నాటి ఒక ప్రాచీన జ్ఞానవాదమునకు సంబంధించిన మతమై యున్నది. మాండేయవాదులు (Mandeans) సాంప్రదాయబద్ధమైన క్రైస్తవ్యమును మరియు యూదా మతమును తృణికరించుదురు, కానీ ఆయన వారి ప్రవక్తలలో ఒకడని బాప్తిస్మమిచ్చు యోహానును బహూగా హెచ్చించుదురు. కల్పిత గాథలు, ద్వైత సిద్ధాంతము (dualism), విపులీకృతమైన ఆచార కర్మకాండలు మొదలగు వారి మతము యొక్క లక్షణములై యున్నవి. [4]G. F. Hasel, “Dove,” in *The International Standard Bible Encyclopedia*, rev. ed., ed. Geoffrey W. Bromiley (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1979), 1:988. [5]“దైవత్వము” విషయంలో కేజేవి అనువాదము చేత మూడు గ్రీకు పదముల అనువదింపబడినవి (అపొస్తలుల కార్యములు 17:29; రోమీయులకు 1:20; కొలొస్సీయులకు 2:9). [6]Anthony Lee Ash, *The Gospel According to Luke*, Part 1, The Living Word Commentary (Austin, Tex.: Sweet Publishing Co., 1972), 77.